సాక్షి సిద్దిపేట

ఆదివారం । 11 । జూన్ । 2023



వర్గల్ క్షేత్రం.. ఉత్సవ శోభితం

శ్రీ కంచి శంకరమఠం, శ్రీశారదా వైదిక స్మార్త విద్యాలయ ప్రారంభోత్సవానికి వర్గల్ క్షేత్రం ముస్తాబైంది. కంచి పీఠాధిపతి శ్రీవిజయేంద్ర సరస్వతి ప్రారంభించనున్నారు.

8లో..

నేడూ ఫిష్ ఫుడ్ ఫెస్టివల్

సిద్దిపేటజోన్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కోమటిచెరువు వద్ద ఏర్పాటు చేసిన ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ ఆదివారం కూడా కొనసాగుతుందని జిల్లా ఫిషరీస్ డెవలప్‌మెంట్ అధికారి మల్లేశం తెలిపారు. శనివారం పూర్తయిన ఫెస్టివల్‌ను మంత్రి హరీశ్‌రావు, కలెక్టర్ సూచన మేరకు మరో రోజు పొడిగిస్తున్నట్లు పేర్కొన్నారు. పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో 2023–24 విద్యాసంవత్సరానికి గాను 4వ నుంచి 8వ తరగతి వరకు అడ్మిషన్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అర్బన్ రెసిడెన్షియల్ ప్రత్యేక అధికారిణి ఇమ్రాన్ బేగం తెలిపారు. ఉచిత భోజనం, బోధన, వసతి, పాఠ్య, నోట్ పుస్తకాలు, దుస్తులు అందించడంతో పాటు వ్యాయామం, యోగా, క్రీడలు నేర్పించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 9121565671, 9959992475 నంబర్లలో సంప్రదించాలన్నారు.

న్యూస్‌రీల్

నిబంధనలు పాటించాలి

సిద్దిపేటకమాన్: ఈ నెల 12 నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని పోలీసు కమిషనర్ శ్వేత తెలిపారు. 20వ తేదీ వరకు నిబంధనలు అమలులో ఉంటాయని, ఉదయం 6 నుంచి సాయంత్రం 6గంటల వరకు పరీక్షా కేంద్రాల పరిసరాల్లో 500 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడొద్దని, సమీపంలో అన్ని జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచాలని సూచించారు.

పనులు వేగవంతం చేయండి



మాట్లాడుతున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకటౌన్: దక్షిణ కాశీగా ప్రసిద్ధి గాంచిన అక్బర్‌పేట భూంపల్లి మండలం కూడవెల్లి రామలింగేశ్వర ఆలయ పనులు త్వరగా వేగవంతం చేయాలని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అధికారులకు ఆదేశించారు. శనివారం హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో కూడవెల్లి ఆలయం చైర్మన్ పూజారి చంద్రం, పురోహితులు సాంకేత్‌శర్మ, ఆలయ కమిటీ బాధ్యులు ఎంపీని కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. పనులు పూర్తి చేసి భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని ఆయన తెలిపారు.

మెగా జాబ్ మేళా సక్సెస్



నియామక పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్: నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశం కల్పించే ఉద్దేశంతో సింధు భారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళా సక్సెస్ అయ్యిందని ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని కోమటిరెడ్డి రజనీకర్‌రెడ్డి ఫంక్షన్ హాలులో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించిన జాబ్ మేళాలో 116 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నట్లు తెలిపారు. 5,825 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 1,758 మందికి జాబ్ వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు పొందిన ఎమ్మెల్యే ఆయన నియామక పత్రాలు అందించారు. పార్టీలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నానని, ఎన్ని కష్టాలు ఎదురైనా వెనుకాడనని స్పష్టం చేశారు.

పెన్షన్ పెంపుపై హర్షం



సీఎం కేసీఆర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న దివ్యాంగులు

చేర్యాల(సిద్దిపేట): దివ్యాంగులకు పెన్షన్ పెంచుతూ సీఎం కేసీఆర్ ప్రకటించడంపై దివ్యాంగుల సంఘం రాష్ట్ర నాయకుడు గదరాజు యాదగిరి హర్షం వ్యక్తం చేశారు. శనివారం చేర్యాలలో గాంధీ విగ్రహం వద్ద దివ్యాంగులతో కలిసి సీఎం కేసీఆర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో దివ్యాంగులు బాల్‌నర్సయ్య, మోహన్‌రెడ్డి, ప్రేమలత, లక్ష్మి, రామయ్య తదితరులు పాల్గొన్నారు. రాంపూర్ మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ దినేష్, కిష్టయ్య, దివ్యాంగులు ఓజయ్య, సిద్దయ్య, బాలయ్య, మల్లేశం, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు 5కే, 10కే రన్

సిద్దిపేటకమాన్: దశాబ్ది ఉత్సవాల సందర్భంగా 12వ తేదీ సోమవారం ఉదయం 5.30గంటలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో 5కే, 10కే వాక్ అండ్ రన్నింగ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పోలీసు కమిషనర్ శ్వేత తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ప్రారంభమయ్యే ఈ రన్, వాక్ 5కే రన్ కాంచిట్ చౌరస్తా, నర్సాపూర్ చౌరస్తా, అంబేడ్కర్ చౌరస్తా మీదుగా కొత్త బస్టాండ్‌కు చేరుకొని తిరిగి అదే రూట్‌లో డిగ్రీ కళాశాల వద్ద ముగుస్తుందన్నారు. 10కే వాక్ డిగ్రీ కళాశాల నుంచి ప్రారంభమై కాంచిట్ చౌరస్తా, నర్సాపూర్ చౌరస్తా, అంబేడ్కర్ చౌరస్తా, కొత్త బస్టాండ్, బీజేఆర్ చౌరస్తా నుంచి తిరిగి డిగ్రీ కళాశాల మైదానంలో ముగుస్తుందన్నారు. కార్యక్రమానికి మంత్రి హరీశ్‌రావు హాజరవుతారని, ప్రజలు, యువత పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఐటీ హబ్ సిద్ధం

ఈ నెల 15న ప్రారంభానికి సన్నాహం

- రూ.64 కోట్లతో జీప్లస్ 4 నిర్మాణం
- 13న పట్టణంలో మెగా జాబ్ మేళా
- హాజరుకానున్న మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు



సాక్షి, సిద్దిపేట: హైదరాబాద్ లాంటి నగరాలకే పరిమితమైన ఐటీ కంపెనీలు జిల్లా కేంద్రాలకు విస్తరిస్తున్నాయి. ఇప్పటికే పారిశ్రామికంగా, పర్యాటకంగా అభివృద్ధి చెందిన సిద్దిపేట జిల్లా.. త్వరలో ప్రారంభం కానున్న ఐటీ హబ్‌తో సాఫ్ట్‌వేర్ రంగంలో కూడా దూసుకుపోనుంది. మంత్రి హరీశ్‌రావు చొరవతో డిసెంబర్ 10, 2020న సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ఐటీ టవర్ నిర్మాణానికి ప్రారంభోత్సవం చేశారు. తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌళిక సదుపాయాల సంస్థ (టీఎస్ఐఐసీ) ఆధ్వర్యంలో రూ.62.82కోట్ల వ్యయంతో జీ ప్లస్ ఫోర్‌తో నిర్మాణం చేపట్టారు. పనులు పూర్తవడంతో ఈ నెల 15న మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు చేతుల మీదుగా ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

టవర్ ప్రత్యేకతలు..

- జీ ప్లస్ ఫోర్‌తో పూర్తయిన ఐటీ టవర్‌లో 2, 3, 4 ఫ్లోర్‌లు వివిధ సాఫ్ట్‌వేర్ కంపెనీలకు, ఫస్ట్ ఫ్లోర్‌ను టాస్క్‌కు కేటాయించారు.
- ఇప్పటికే 12 సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఎంఓయూపై సంతకాలు చేశాయి.
- వివిధ కంపెనీలు సమావేశాలు నిర్వహించుకునేందుకు వీలుగా ప్రత్యేకంగా హాల్‌లను నిర్మించారు.
- రెండేళ్ల పాటు నిర్వహణ, అద్దె, విద్యుత్, ఇంటర్‌నెట్ బిల్లుల్లో ప్రభుత్వం రాయితీని ఇవ్వనుంది.
- ఈ కంపెనీల ద్వారా తొలి విడతలో 700 మందికి స్థానికులకు ఉద్యోగాలు, పరోక్షంగా వేయి మందికిపైగా ఉపాధి లభించనుంది.
- ఈ నెల 13న పట్టణంలో పొన్నాల పోలీస్ కన్వెన్షన్ హాల్‌లో మెగా జాబ్ మేళాను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.
- 12 కంపెనీలు పాల్గొనే ఈ జాబ్ మేళా కోసం గూగుల్ ఫాం ద్వారా రిజిస్ట్రేషన్లు స్వీకరిస్తున్నారు.
- ఇప్పటి వరకు 8వేల మందికి పైగా నిరుద్యోగులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.
- http://FORMS.GLE/NVWJDUHR2WQZXBFT6 లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో చేసుకోవాలి.

టాస్క్ ఆధ్వర్యంలో శిక్షణ

సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగాలు సాధించేందుకు స్థానిక యువతకు పలు అంశాల్లో శిక్షణ అందించేందుకు తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్(టాస్క్)ను కేటాయించారు. భవనం మొదటి అంతస్తులో టాస్క్‌కు కేటాయించారు. ప్రతీ బ్యాచ్‌లో 104 మందికి ఉదయం, మధ్యాహ్నం శిక్షణ ఇవ్వనున్నారు. 45రోజుల పాటు శిక్షణ ఇచ్చి వివిధ కంపెనీల ఉద్యోగాలకు రెఫర్ చేయనున్నారు. ఈనెల 15న ఐటీ హబ్ ప్రారంభోత్సవం సందర్భంగా వివిధ కంపెనీలలో ఉద్యోగాలు పొందిన యువతకు నియామకపత్రాలు, కంపెనీలకు స్పేస్ కేటాయింపు పత్రాలను అందించనున్నారు.

ఏర్పాట్లు పూర్తి



ఐటీ హబ్ ద్వారా స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. ఈ నెల 15న మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు చేతుల మీదుగా ఐటీ హబ్‌ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే 12 కంపెనీలకు స్పేస్ అలాట్ చేశాం.

– మాధవి, జోనల్ మేనేజర్, టీఎస్ఐఐసీ

సమన్వయంతోనే సుపరిపాలన సాధ్యం



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, పక్కన సీపీ శ్వేత, అదనపు కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్

కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేటరూరల్: అన్ని ప్రభుత్వ సంస్థ సమన్వయంతోనే సుపరిపాలన సాధ్యం అవుతుందని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సుపరిపాలన దినోత్సవంలో సీపీ శ్వేతతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, ఎన్జీఓలు, న్యాయవ్యవస్థ, పోలీస్ వ్యవస్థ, మీడియా అందరూ కలిసి సమన్వయంతో పనిచేస్తే ప్రజాసంక్షేమం సాధ్యమవుతుందన్నారు. రాష్ట్ర ఆవిర్భావం అనంతరం నూతన జిల్లాలు, మండలాలు, రెవెన్యూ, పోలీస్, ఇంజనీరింగ్, వ్యవసాయ డివిజన్లు తదితర శాఖల ఏర్పాటుతో వికేంద్రీకరణ జరిగి అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. సంక్షేమం, విద్య, వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయం, మౌలిక వసతుల కల్పన, మహిళా సంక్షేమం, రెవెన్యూ, పోలీస్ తదితర అన్ని శాఖల్లో వచ్చిన మార్పు ఇందుకు నిదర్శమన్నారు. పోలీస్ కమిషనర్ శ్వేత మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ ఎల్లప్పుడు పనిచేస్తుందని, ప్రజల సహకారంతో అన్ని గ్రామాల్లో ప్రశాంతత నెలకొందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజలకు చేరువయ్యామని, షీ టీంతో మహిళలకు భద్రత పెరిగిందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ముజామ్మిల్‌ఖాన్, శ్రీనివాస్ రెడ్డి, అటవీశాఖ అధికారి శ్రీనివాస్, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, ఇరిగేషన్, పరిశ్రమలు శాఖ అధికారులు, ఏఓ అబ్దుల్ రెహమాన్ పాల్గొన్నారు.

చిన్ననాటి నుంచే మన సంస్కృతి నేర్పించాలి



ప్రశంస పత్రాలు అందుకున్న చిన్నారులతో రాధాకృష్ణశర్మ

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాధాకృష్ణశర్మ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థులకు చిన్ననాటి నుంచే భారతీయ సంస్కృతి నేర్పించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వేలేటి రాధాకృష్ణశర్మ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శ్రీ లంబోదర కల్చర్ అకాడమీ, శ్రీ విష్ణురాజా కూచిపూడి అకాడమీ సంయుక్తంగా నిర్వహించిన దశాబ్ది నృత్యోత్సవం–2023 కార్యక్రమం, అదే విధంగా 45 రోజు పాటు అందిస్తున్న నాట్య శిక్షణ కార్యక్రమ ముగింపు సమావేశాన్ని జిల్లా కేంద్రంలోని శ్రీనివాస ధ్యాన మందిరంలో నిర్వహించారు. ముందుగా నృత్యకారులు తమ నాట్యాన్ని ప్రదర్శించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు, ప్రశంస పత్రాలు అందించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణశర్మ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు అన్ని కళల్లో రాణించాలన్నారు. మన దేశ సంస్కృతి, సంప్రదాయాలను చిన్నారులకు చిన్ననాటి నుంచే నేర్పించడం ద్వారా వారికి సమాజంపై అవగాహన ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో నాట్య విజ్ఞాన్ డాక్టర్ గొనే మౌనిక, బావుపల్లి యాదగిరి, తీగుళ్ల సరస్వతి రామశర్మ, స్వప్న, ఆకుల ప్రసాద్, కళా అశోక్ పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజమార్గం



కేసులను పరిష్కరిస్తున్న జడ్జిలు రఘురాం, భవాని, స్వాతిరెడ్డి, చందన, శ్రావణి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ రఘురాం
- మొత్తం 2,324 కేసులు పరిష్కారం

సిద్దిపేటకమాన్: రాజీ మార్గమే రాజ మార్గమని, ఏళ్ల తరబడి కేసులను లోక్ అదాలత్‌లో రాజీ ద్వారా పరిష్కరించుకోవచ్చని సిద్దిపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి, లోక్ అదాలత్ చైర్మన్ డాక్టర్ టి.రఘురాం అన్నారు. సిద్దిపేట కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. లోక్ అదాలత్‌లో సివిల్, క్రిమినల్, బ్యాంకింగ్ ఇన్సూరెన్స్ కేసుల పరిష్కారానికి నాలుగు ప్రత్యేక ప్రజాన్యాయ పీఠాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1,395 క్రిమినల్ కేసులు, 595 ఎస్‌టీసీ, 7 బ్యాంక్, 3 ఎక్సైజ్‌తో పాటు ఇతర కేసులు కలిపి 2,324లను పరిష్కారించినట్లు పేర్కొన్నారు. 18 ఇన్సూరెన్స్ కేసుల్లో రూ.71,27,666 బాధితులకు క్లెయిమ్ అయ్యేలా చేశామన్నారు. హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 300మందికి పైగా కక్షిదారులకు భోజనం ఏర్పాటు చేయడంపై జడ్జి రఘురాం ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో జడ్జిలు భవాని, స్వాతిరెడ్డి, జడ్జి చందన, జడ్జి శ్రావణియాదవ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు సాయిబాబ, బాలయ్య, ఆత్మరాములు, దేవునూరి రవీందర్, ప్రవీణ్‌రెడ్డి, ప్రకాష్, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్‌లో..

గజ్వేల్‌రూరల్: చిన్న చిన్న సమస్యలతో కక్షలు పెంచుకోవద్దని, ఈర్షలకు పోయి కేసులు పెట్టుకోవడంతో విలువైన కాలం, డబ్బు వృథా అవుతుందని గజ్వేల్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సౌమ్య అన్నారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జి ప్రియాంకతో కలిసి శనివారం గజ్వేల్‌లోని కోర్టులో ఏర్పాటు



మాట్లాడుతున్న జడ్జి సౌమ్య

చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రిమినల్, బ్యాంకు తదితర 251 కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ శంకర్, అసిస్టెంట్ పీపీ విజయసుధ, ఏపీజీ అశోక్‌రెడ్డి, న్యాయవాదులు, బాలల సంక్షేమ సమితి జిల్లా సభ్యులు దేశబోయిన నర్సింలు, ఆయా బ్యాంకుల మేనేజర్లు, మండల లీగల్ సర్వీస్ సిబ్బంది నర్సింహాచారి, కోర్టు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్: క్షణికావేశంలో జరిగిన పొరపాట్లను రాజీమార్గంతో పరిష్కరించుకోవాలని హుస్నాబాద్ ప్రిన్సిపల్ సివిల్ కోర్టు జూనియర్ జడ్జి శివరంజని అన్నారు. శనివారం పట్టణంలోని కోర్టు హాల్‌లో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. లోక్ అదాలత్‌లో ఇరువురు కక్షిదారులకు సంబంధించిన 360 కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకున్నారు. ఈ సందర్భంగా జడ్జి శివరంజని మాట్లాడుతూ.. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారు మరోసారి మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. చిన్న చిన్న సమస్యలతో కోర్టు మెట్లు సమయాన్ని, డబ్బును వృథా చేసుకోకుండా ఇరువురు కక్షిదారులు సమన్వయంతో సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏజీపీ కన్నోజు రామకృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిత్తారి రవీందర్, ప్రధాన కార్యదర్శి సంపత్, న్యాయవాదులు బద్దిపడిగ రాజిరెడ్డి, చిత్తారి హన్మయ్య, ఒగ్గోజు సదానందం పాల్గొన్నారు.



హుస్నాబాద్: మాట్లాడుతున్న జడ్జి శివరంజని

'విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి'

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యారంగంలో నెలకొన్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ వివేక్ అన్నారు. శనివారం ఏబీవీపీ సిద్దిపేట శాఖ ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యలపై జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కన్వీనర్ బీరకాయల వివేక్ మాట్లాడుతూ.. సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు విద్యను వ్యాపారంగా మలుచుకొని విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకుంటున్నారన్నారు. అనుమతులు లేని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తులు త్వరగా అందజేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు అందుబాటులో తీసుకురావాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో బోధన, బోధనేతర సిబ్బంది ఖాళీలను త్వరగా భర్తీ చేయాలన్నారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులు పూర్తిస్థాయిలో కల్పించాలన్నారు. కార్యక్రమంలో నగర సంయుక్త కార్యదర్శులు సంతోష్, హరీశ్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేకతను కప్పిపుచ్చడానికే ఉత్సవాలు

బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు మోహన్



మాట్లాడుతున్న బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు మోహన్

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రభుత్వంపై ఉన్న ప్రజావ్యతిరేకతను కప్పిపుచ్చడానికే ఉత్సవాల పేరుతో కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు మోహన్ అన్నారు. శనివారం సిద్దిపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్సవాల పేరుతో కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారన్నారు. ప్రజాసమస్యలు పట్టించుకోని మంత్రులు, సీక్రెట్ జీఓలు, చీకటి ఒప్పందాలతో పాలన నడుస్తుందన్నారు. తెలంగాణ ఆవిర్భావం రోజు ధనిక రాష్ట్రం అని, నేడు అప్పుల కుప్పలాగా మారిందన్నారు. ఎవరి ప్రయోజనాల కోసం 111 జీఓ ఎత్తివేశారని ప్రశ్నించారు. తెలంగాణలో మద్యం ఏరులై పారుతుందని, ప్రభుత్వ కార్యాలయాల్లో సామాన్యుడికి న్యాయం జరగడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లింగంపల్లి యాదగిరి, వెంకటేశ్, రోమాల బాబు, పుల్లూరు ఉమేశ్, మల్లేశం, సంజయ్, నర్సింలు, శంకర్, రాజు, హరికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రిలిమినరీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

- హాజరుకానున్న 7,786 మంది అభ్యర్థులు
- బందోబస్తు పరిశీలించిన అడిషనల్ డీసీపీ మహేందర్



సూచనలు చేస్తున్న అడిషనల్ డీసీపీ మహేందర్



హాల్‌టికెట్ నంబర్లను పరిశీలిస్తున్న అధికారులు, అడిషనల్ డీసీపీ మహేందర్

సిద్దిపేటరూరల్: టీఎస్‌పీఎస్సీ గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా అన్ని కేంద్రాల్లో అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆదివారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే పరీక్షకు 7,786 మంది హాజరుకానున్నట్లు తెలిపారు. ఇప్పటికే పరీక్షా కేంద్రాల్లో టేబుల్స్, తాగునీరు, మరుగుదొడ్డి, విద్యుత్ వంటి సౌకర్యాలను కల్పించినట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, కేంద్రం పరిసరాల్లో ఎవరూ గుమికూడొద్దని పోలీసు అధికారులు సూచిస్తున్నారు.

ఇవీ నిబంధనలు..

- జిల్లా వ్యాప్తంగా ఆదివారం నిర్వహించే ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణకు 20 కేంద్రాలను కేటాయించారు. వీటిలో 7,786 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు.
- పరీక్ష రాసే అభ్యర్థులు 2 గంటల ముందే కేటాయించిన కేంద్రానికి చేరుకోవాలి.
- పరీక్ష కేంద్రంలోకి మొబైల్‌ఫోన్, వాచ్, ఎలక్ట్రానిక్ వస్తువులు, షూస్ వంటివి అనుమతి లేదని స్పష్టం చేశారు.
- ఉదయం 8 గంటల నుంచి అభ్యర్థుల హాల్ టికెట్, తనిఖీచేసి కేంద్రంలోకి పంపిస్తారు.
- అనంతరం సంబంధిత అధికారులు అభ్యర్థుల ఫింగర్‌ప్రింట్, ఫొటో నిర్ధారణ పరీక్ష చేస్తారు.
- ఉదయం 10.15 నిమిషాలు దాటిన తర్వాత కేంద్రంలోకి ఎవరికి అనుమతి ఉండదని స్పష్టం చేశారు.
- హాల్ టికెట్ మీద ఫొటో ప్రింట్ లేని అభ్యర్థులు మూడు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలను వెంట తీసుకొని రావాలని, హాల్ టికెట్‌పై సంతకం చేసి, గుర్తింపు కార్డు చూపించాలని సూచించారు.
- దివ్యాంగ అభ్యర్థులకు స్క్రైబులను ఏర్పాటు చేస్తున్నారు. పరీక్ష సమయాన్ని 50 నిమిషాలు అదనంగా ఇవ్వనున్నారు.

పటిష్ట బందోబస్తు

సిద్దిపేటకమాన్: గ్రూప్ వన్ పరీక్ష జరిగే పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్ తెలిపారు. శనివారం పలు సెంటర్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే లోనికి అనుమతించాలని సిబ్బందికి సూచించారు. ఆయనతో సిద్దిపేట టూటౌన్ సీఐ రవికుమార్, ఎస్ఐ భాస్కర్ ఉన్నారు.

క్లుప్తంగా

రాంసాగర్‌లో చెరువులో చేపలు మృతి


ఒడ్డుకు కొట్టుకొచ్చిన చేపలు

రాయపోలు(దుబ్బాక): మండలంలోని రాంసాగర్ చెరువులో చేపలు మృతిచెందాయి. మత్స్యకారుల వివరాల ప్రకారం.. గ్రామంలోని ఎల్లమ్మ చెరువులో శుక్రవారం సాయంత్రం కొన్ని చేపలు తేలి ఉండడాన్ని మత్స్యకారులు గమనించారు. శనివారం ఉదయం చాలా చేపలు మృతిచెంది నీటిపై తేలడంతో ఎవరైనా విషప్రయోగం చేసి ఉంటారా.. అనే అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎస్‌ఐ మహబూబ్ వచ్చి చెరువును పరిశీలించారు. పశు వైద్యులతో పోస్టుమార్టం నిర్వహించారు. 3 క్వింటాళ్ల వరకు చేపలు మృతిచెంది ఉంటాయని, పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

నెలన్నర వ్యవధిలో తండ్రీకొడుకు..


కృష్ణాగౌడ్(ఫైల్)

వర్గల్(గజ్వేల్): నెలన్నర వ్యవధిలో తండ్రి, కొడుకు మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. వర్గల్ మండలం గౌరారం గ్రామానికి చెందిన కారు డ్రైవర్ నగరం కృష్ణాగౌడ్(45)కు భార్య అన్నపూర్ణ, కొడుకులు శేఖర్, అభిలాష్ ఉన్నారు. కొడుకులు ఇద్దరు ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్నారు. చిన్న కొడుకు అభిలాష్‌గౌడ్(22) ఏప్రిల్ 22న మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఆ ఘటన నుంచి కోలుకునేలోగా శనివారం అనారోగ్యంతో తండ్రి కృష్ణాగౌడ్ మృతిచెందాడు.

రేషన్ బియ్యం స్వాధీనం

జహీరాబాద్ టౌన్: రాష్ట్ర సరిహద్దు దాటిస్తున్న రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. పట్టణంలోని అల్గోల్ చౌరస్తాలో పోలీసులు, సివిల్ సప్లై అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. హైదరాబాద్ నుంచి ముంబాయి వైపు వెళుతున్న లారీపై అనుమానం రాగా తనిఖీలు నిర్వహించారు. లారీలో అక్రమంగా తరలిస్తున్న 298 క్వింటాల రేషన్ బియ్యం గుర్తించి పట్టుకున్నారు. లారీ యజమాని బావేష్‌బాయ్‌తోపాటు డ్రైవర్ సంజయ్, రషీద్‌ఖాన్‌లపై కేసు నమోదు చేశారు.

వర్గల్ క్షేత్రం.. ఉత్సవ శోభితం

- నేడు శంకరమఠం, వేద పాఠశాల ప్రారంభోత్సవం
- హాజరుకానున్న కంచి పీఠాధిపతి శ్రీవిజయేంద్ర సరస్వతి
- మూడు రోజులు పాటు నిర్వహణ


శంకరమఠం వద్ద స్వాగత తోరణం

వర్గల్(గజ్వేల్): శ్రీ కంచి శంకరమఠం, శ్రీశారదా వైదిక స్మార్త విద్యాలయ ప్రారంభోత్సవానికి వర్గల్ శ్రీవిద్యాసరస్వతి క్షేత్రం ముస్తాబైంది. ఆదివారం నుంచి మూడు రోజులపాటు కొనసాగనున్న వేడుకలకు కంచి కామకోటి సర్వజ్ఞ పీఠాధిపతి శ్రీవిజయేంద్ర సరస్వతి హాజరుకానున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు క్షేత్రాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. కాషాయ తోరణాలు, జెండాలు, విద్యుత్ కాంతులను ఏర్పాటుతో క్షేత్రానికి ఉత్సవ శోభ సంతరించుకుంది. శామీర్‌పేట రింగు రోడ్డు నుంచి వర్గల్ వరకు స్వామివారికి స్వాగతం పలుకుతూ కటౌట్లు ఏర్పాటు చేసినట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖర సిద్ధాంతి తెలిపారు.

కార్యక్రమ వివరాలు

- ఉదయం 8 గంటలకు శ్రీవిజయేంద్ర సరస్వతి స్వామికి వర్గల్ క్రాస్‌రోడ్డు వద్ద పూర్ణకుంభ స్వాగతం పలుకుతారు.
- వర్గల్ హనుమాన్ టెంపుల్ నుంచి శోభాయాత్ర, మంగళహారతులతో స్వాగతం ఉంటుంది.
- 8.30 గంటలకు శంకర మఠం, వేద విద్యాలయాన్ని ప్రారంభిస్తారు.
- సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభోత్సవ సభ ఉంటుంది.
- శ్రీవిజయేంద్ర సరస్వతి ఆధ్వర్యంలో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం శ్రీచంద్రమౌళీశ్వర పూజ నిర్వహిస్తారు.
- ఆదివారం సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటల వరకు, సోమవారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటలు, సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు, మంగళవారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు స్వామివారి దర్శనం ఉంటుంది.
- వేడుకలకు మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, పీఠాధిపతులు హాజరవుతారని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.


విద్యుత్‌కాంతుల్లో వర్గల్ శ్రీకంచి శంకరమఠం

ఇరువర్గాల మధ్య భూతగాదా


తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్న నారాయణరెడ్డి కుటుంబసభ్యులు

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి శివారులో ఓ స్వాతంత్ర్య సమరయోధుడికి ప్రభుత్వం కేటాయించిన భూమి విషయమై ఇరువర్గాల మధ్య కొన్నేళ్లుగా గొడవ జరుగుతోంది. మండలపరిధిలోని మానెపల్లి గ్రామానికి చెందిన రాఘవులు నారాయణరెడ్డికి సమరయోధుల కోటాకింద ప్రభుత్వం 1984–85లో వెల్దుర్తిలోని సర్వే నంబర్ 210లో 10 ఎకరాల భూమిని కేటాయించింది. ఈ భూమిని వెల్దుర్తికి చెందిన రమేశ్‌చందర్ కబ్జా చేసి, తన కుటుంబసభ్యుల పేరిట రికార్డు మార్పు చేసుకున్నాడని నారాయణరెడ్డి కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై కోర్టులో కేసు నడుస్తోంది. శనివారం ఆ భూమిలోకి వెళితే రమేశ్‌చందర్, అతని కుటుంబ సభ్యులతోపాటు మరికొందరు తమపై దాడిచేసి చంపడానికి ప్రయత్నించారని నారాయణరెడ్డి కుమారుడు మధుసూధన్‌రెడ్డి, కోడలు శారద, కూతురు వెంకటలక్ష్మి, అల్లుడు వెంకట్రామిరెడ్డి ఆరోపించారు. భూ తగాదా విషయంలో ఇరువర్గాల వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్టు ఏఎస్‌ఐ వసురాం తెలిపారు.

హరితహారం చెట్ల నరికివేతపై విచారణ


చెట్ల నరికివేతపై విచారణ చేస్తున్న పోలీసులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని గొల్లకుంట గ్రామంలో రోడ్డుకిరువైపులా నాటిన హరిత హారం చెట్లను ఓ రైతు నరికివేశాడు. ఎస్‌ఐ తాండ్ర వివేక్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు సుంకరి రాంచందర్‌రెడ్డి శనివారం మూడు పెద్దవృక్షాలను నేలమట్టం చేశాడని సమాచారం రావడంతో సిబ్బందిని పంపిచానన్నారు. విద్యుత్ వైర్లు చెట్ల పైనుంచి వెళ్లడంతో అప్పడప్పుడూ మంటలు వస్తున్నాయని, ఈ కారణంగా చెట్లను నరికివేసినట్లు రైతు చెబుతున్నాడన్నారు. ఈ సంఘటనపై తమకు గ్రామస్తులెవరూ ఫిర్యాదు చేయలేదని, ఈ విషయంపై విచారణ జరిపిస్తామన్నారు.

వ్యక్తి అదృశ్యం

చేగుంట(తూప్రాన్): ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఎస్‌ఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. చేగుంటకు చెందిన తోకటి శ్యామలకు 12 సంవత్సరాల క్రితం రాముతో వివాహం జరిగింది. రాము అత్తగారింట్లో ఉంటూ హమాలీ పనులు చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 7న కుటుంబ సభ్యులంతా డాబాపై పడుకున్నారు. తెల్లారి లేచి చూసేసరికి రాము కనిపించలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో, చుట్టుపక్కలా వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. శ్యామల ఫిర్యాదు కేసు నమోదు చేశారు.

తృటిలో తప్పిన ప్రమాదం


గ్యాస్ స్టవ్‌పై పడ్డ రాయి

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని మీర్జాపూర్ గ్రామంలో శనివారం సాయంత్రం వీచిన గాలులకు పొన్నబోయిన లత ఇంటిపై కప్పు కూలిపోయింది. ఆ సమయంలో లత వారి పిల్లలతో ఇంట్లోనే ఉండటం గాలి వానకు ఇంటి పైకప్పు రేకులు కూలడంతో లత పిల్లల తీసుకొని బయటకు రావడంతో ప్రాణపాయం తప్పింది. పేద కుటుంబం ఇల్లుపై కప్పు కూలి నీడ లేకుండా పోయిందని ప్రభుత్వం ఆర్థికసాయం చేసి ఆదుకోవాలని బీఆర్‌ఎస్ నాయకుడు పోన్నబోయిన శ్రీనివాస్ కోరారు.

'ఆ టీచర్లకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి'

హైదరాబాద్: డీఎస్సీ–2003 ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులను అమలు చేసి పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని ఎమ్మెల్సీలు రఘోత్తమ్‌రెడ్డి, ఏవీఎన్ రెడ్డిలు పేర్కొన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డీఎస్సీ 2003 పాత పెన్షన్ పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2004 జనవరి 1వ తేదీ నుంచి కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం విధానాన్ని అమలులోకి తెచ్చిందని, 2004 జనవరి 1వ తేదీకి ముందే రాత పరీక్ష ఫలితాలు పూర్తయి నియామక ప్రక్రియలో జాప్యం కారణంగా సీపీఎస్ పరిధిలోకి వచ్చిన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం పరిధిలోని అన్ని శాఖల్లో అమలు చేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉపాధ్యాయులను పాత పెన్షన్ విధానంలోనే కొనసాగించాలన్నారు.

వేర్వేరు చోట్ల నలుగురి ఆత్మహత్య

ఆర్థిక ఇబ్బందులతో ఇద్దరు.. అనారోగ్యంతో బాధపడుతూ మరొకరు, బావిలోదూకి ఇంకొకరు ఆత్మహత్య చేసుకున్నారు.

ఆర్థిక అబ్బందులతో...


ఎల్లయ్య మృతదేహం

చేగుంట(తూప్రాన్): ఆర్థిక ఇబ్బందులతో ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం..చేగుంటలోని సుభాష్‌నగర్‌కాలనీకి చెందిన ఈప్తి ఎల్లయ్య(30)కు సునీతతో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. పిల్లలు లేకపోయినా ఇద్దరూ కూలి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆరు నెలలుగా ఆర్థిక ఇబ్బందులు మొదలయ్యాయి. ఈ క్రమంలోనే శుక్రవారం రాత్రి ఎల్లయ్య బైక్‌పై బయటకు వెళ్లాడు. అర్ధరాత్రి దాటినా ఇంటికి రాలేదు. బంధువులు ఎల్లయ్య కోసం వెతకగా, చేగుంట చెరువు వద్ద ఎల్లయ్య బైకు, చెప్పులు కనిపించాయి. పోలీసులు జాలర్ల సాయంతో చెరువులో వెతికించగా ఎల్లయ్య మృతదేహం లభ్యమైంది. భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరించినట్టు ఎస్‌ఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపారు.

బావిలో దూకి ...

కోహీర్(జహీరాబాద్): వ్యవసాయ బావిలో దూకి ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ సురేష్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని బిలాల్‌పూర్ గ్రామానికి చెందిన గడ్డం ఏసయ్య(65) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఎన్ని ఆస్పత్రులు తిరిగినా ప్రయోజనం లేకుండాపోయింది. మానసికంగా కుంగిపోయిన ఏసయ్య తన సొంత వ్యవసాయబావిలో దూకి శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. కుమారుడు ప్రశాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పురుగుల మందు తాగి..


నాగభూషణం(ఫైల్)

దుబ్బాకరూరల్: అప్పుల బాధతో వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పద్మశాలి గడ్డలో జరిగింది. సంఘటనకు సంబంధించి ఎస్‌ఐ బత్తుల మహేందర్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన మ్యాదరి నాగభూషణం(55) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. అప్పులు చేసి కుమారుడు, కూతురు వివాహం చేశాడు. చేసిన అప్పులు ఎక్కువ కావడంతో ఎలా తీర్చాలో తెలియక మానసికంగా బాధపడేవాడు. శుక్రవారం వడ్డెర కాలనీ సమీపంలో ఉన్న చింత చెట్టు వద్ద పురుగుల మందు తాగి పడిపోయాడు. వెంటనే గుర్తించిన స్థానికులు కుటుంబీకులకు సమాచారం అందించారు. అతడిని వెంటనే దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడ నుంచి సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి నాగభూషణం మృతి చెందినట్లు నిర్ధారించారు. శనివారం మృతుడి భార్య దేవలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

డంపింగ్ యార్డులో...

ములుగు(గజ్వేల్): ములుగు మండలం అల్లీనగర్ గ్రామంలో డంపింగ్‌యార్డులో ఓ యువకుడి మృతదేహాన్ని స్థానికుల సమాచారంతో పోలీసులు గుర్తించారు. మృతుడు సిద్దిపేట కాల్వకుంట కాలనీకి చెందిన మిట్టపల్లి విజయ్(27)గా పోలీసులు నిర్ధారించారు. ఘటనా స్థలాన్ని గజ్వేల్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి సందర్శించారు. పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

మొబైల్ ఫోన్లు అప్పగింత


మొబైల్ ఫోన్లను అప్పగిస్తున్న పోలీసులు

నారాయణఖేడ్: పట్టణానికి చెందిన అనిల్, మనూరు మండలం శెల్గిరకు చెందిన తుకారాం నెల క్రితం తమ మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నారు. పోర్టల్‌లో తమ వివరాలు నమోదు చేశారు. ఆయా మొబైల్ ఫోన్‌లు ఆన్‌లోనే ఉన్నట్లు గుర్తించిన పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. శనివారం బాధితులను ఖేడ్ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి స్థానిక ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి, కానిస్టేబుల్ రమేష్ తమ చేతుల మీదుగా అందజేశారు. ఎవరైనా మొబైల్ ఫోన్లను పోగొట్టుకుంటే మీ–సేవా ద్వారా సంబంధిత పోర్టల్‌లో వివరాలను నమోదు చేయించాలని ఎస్‌ఐ సూచించారు.

దేశం మెచ్చిన నేత కేసీఆర్

- రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు దేశానికి ఆదర్శం
- రాష్ట్ర వైద్య ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): దేశం మెచ్చిన నేత ముఖ్యమంత్రి కేసీఆర్ అని రాష్ట్ర వైద్య ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శనివారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధి ఉస్మాన్‌నగర్‌లో ఏర్పాటుచేసిన కొల్లూర్ పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించారు. తర్వాత తెల్లాపూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న శ్రీమల్లిఖార్జునస్వామి, శ్రీబీరప్ప స్వామి, విశ్వకర్మ దేవాలయాల నిర్మాణాలకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డితో కలసి భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రజల రక్షణకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని, అందులో భాగంగా నూతన పోలీస్‌స్టేషన్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని దానిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం కొల్లూర్ నూతన పోలీస్‌స్టేషన్ మంజూరు చేసినట్లు తెలిపారు. దేశంలో ఎక్కడ లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఇక్కడ అమలవుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర రాష్ట్రలకు చెందిన ఇతర పార్టీల నేతలు సైతం కేసీఆర్‌ను కలసి అభినందిస్తున్నట్లు తెలిపారు. కుల వృత్తులపై ఆధారపడిన వారికి ప్రభుత్వం ఆర్థికంగా అండగా నిలుస్తుందన్నారు. గొల్ల, కురుమల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందనివివరించారు. గొల్ల, కురుమల భవనల కోసం రూ.500 కోట్ల విలువ చేసే భూములను కేటాయించడం జరిగిందని, ఆ భవనాలను త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. తెల్లాపూర్‌లో మల్లికార్జున స్వామి, బీరప్పా స్వామి, విశ్వకర్మ ఆలయాల నిర్మాణానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. విశ్వకర్మ ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి రూ.50 లక్షలు ఇవ్వడం సంతోషకరమన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మంత్రి హరీశ్‌రావు సిద్దిపేటతో సమానంగా పటాన్‌చెరు నియోకకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నారని కొనియాడారు. పటాన్‌చెరు పట్టణంలో మంత్రి సహాయ సహకారాలతో త్వరలో రూ. 300 కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో కలెక్టర్ డాక్టర్ శరత్, సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర, మున్సిపల్ చైర్‌పర్సన్ లలితా సోమిరెడ్డి, మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి, తెల్లాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ రాములు గౌడ్, రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్పనగేష్, కౌన్సిలర్ పాల్గొన్నారు.


కొల్లూర్ పోలీస్‌స్టేషన్ ప్రారంభోత్సవంలో మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

చికిత్స పొందుతున్న ముగ్గురి మృతి

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు యత్నించిన ఒకరు... రోడ్డు ప్రమాదంలో గాయపడిన మరో ఇద్దరు చికిత్స పొందుతూ మృతి చెందారు.

ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టి...


ఎల్లయ్య(ఫైల్)

నంగునూరు(సిద్దిపేట): హెడ్ కానిస్టేబుల్ రంగారెడ్డి చెప్పిన వివరాల ప్రకారం.. దూల్మిట్ట మండలం జాలపల్లి గ్రామానికి చెందిన బందారం ఎల్లయ్య (43) శుక్రవారం బైక్‌పై నంగునూరుకు వస్తుండగా ఎదురుగా వస్తున్న యాట సాయిబాబ బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఎల్లయ్య తల, ఛాతీకి తీవ్ర గాయాలయ్యాయి. అతడిని సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి భార్య బందారం స్వరూప ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో..


కుమార్ (ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్): ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం..మండల పరిధిలోని ధరిపల్లి గ్రామానికి చెందిన సల్ల కుమార్(29) ప్రైవేట్ పరిశ్రమలో పనిచేసేవాడు. మూడు నెలల క్రితం అక్కడ ఉద్యోగం మానేశాడు. దీంతో ఆర్థిక ఇబ్బందులు మొదలయ్యాయి.దీంతో మానసిక ఆవేదనకు గురై గత నెల 30న పొలం వద్ద పురుగుల మందు సేవించాడు. గమనించిన కుటుంబ సభ్యులు నార్సింగి మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స నిమిత్తం నిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. భార్య రాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఎల్లారెడ్డిలో అంగన్‌వాడీ టీచర్


కవిత(ఫైల్)

పెద్దశంకరంపేట(మెదక్): మండలపరిధిలోని బూర్గుపల్లికి చెందిన అంగన్‌వాడీ టీచర్ కవిత(35) తన భర్త జవహర్‌తో కలిసి శనివారం ఎల్లారెడ్డిలోని ఓ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం బైక్‌పై బయలుదేరింది. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ సమీపంలోని బొగ్గుగుడిసె వద్ద రాగానే అకస్మాత్తుగా బండిపై నుంచి జారిపడింది. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డిలో ఓ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. కవిత విధినిర్వహణతో పాటు అందిరితో కలిసిమెలిసి ఉండేదని స్థానికులు తెలిపారు. ఆమె మృతి పట్ల సర్పంచ్ గుల్గరి సరితామల్లేషం సంతాపం వ్యక్తం చేశారు.

నర్సాపూర్‌లో గుర్తుతెలియని బాలిక



నర్సాపూర్ రూరల్: గుర్తుతెలియని బాలిక నర్సాపూర్ బస్టాండ్‌లో ఉండగా, స్థానికులు సమాచారం ఇచ్చారని ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు. శనివారం సాయంత్రం బస్టాండ్‌లో ఓ బాలిక ఏడుస్తూ ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా, సిబ్బంది బాలికను స్టేషన్‌కు తీసుకొచ్చారన్నారు. అయితే ఆ బాలిక తన పేరుగానీ, తల్లిదండ్రులు పేరుగానీ మరే వివరాలు చెప్పలేకపోతోంది. బాలికను ఎవరైనా గుర్తిస్తే నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. బాలికను చైల్డ్ వెల్ఫేర్ అధికారుల వద్ద ఉంచామన్నారు.

చేపలు పట్టడానికి వెళ్లి..


ఊర చెరువులో అనయాతుల్లా మృతదేహం

మనోహరాబాద్(తూప్రాన్): చేపలు పట్టడానికి వెళ్లిన ఓ వ్యక్తి చెరువులో మునిగి చనిపోయాడు. ఎస్‌ఐ సందీప్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... బీహార్‌కు చెందిన మహ్మద్ అనయతుల్లా (28) పరిశ్రమలో పనులు చేయడానికి కుటుంబంతో కలిసి వచ్చి స్థానికంగా ఉంటున్నాడు. ఈ క్రమంలోనే శుక్రవారం చేపలు పట్టడానికి కాళ్లకల్‌లోని ఊరచెరువుకు వెళ్లాడు. శనివారం ఉదయం అనయతుల్లా మృతదేహం చెరువు నీటిలో తేలడంతో స్థానికులు పోలీసులు, కుటుంబసభ్యులకు సమాచారమిచ్చా రు. మృతుడి భార్య అస్మిన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమి త్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు.

ఆటో ఢీకొని...

గజ్వేల్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని అక్కారం మధిర గ్రామమైన కోనాపూర్‌కు చెందిన మొగుల్ల కన్నయ్య(32)కు తల్లిదండ్రులతో పాటు భార్య లావణ్య ఉన్నారు. కన్నయ్య కూరగాయలు విక్రయిస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. శుక్రవారం రాత్రి తన బైక్‌పై అక్కారం నుంచి కోనాపూర్‌కు వెళుతున్నాడు. ఈ క్రమంలోనే ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టగా, బైక్‌పై ఉన్న కన్నయ్య తల, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు గజ్వేల్ పోలీసులు తెలిపారు. కాగా ఈ విషయం తెలుసుకున్న ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి శనివారం గజ్వేల్‌లోని ప్రభుత్వాస్పత్రి మార్చురీ వద్ద బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో అక్కారం సర్పంచ్ బాల్‌చంద్రం, దాతర్‌పల్లి సర్పంచ్ తోట లక్ష్మణ్, ఎంపీటీసీ ఆంజనేయులు, నాయకులు విరాసత్‌అలీ, స్వామిచారి తదితరులున్నారు.

కారు అదుపుతప్పి ..

గజ్వేల్‌రూరల్: కారు అదుపుతప్పడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల చెప్పిన వివరాల ప్రకారం.. సిద్దిపేట హనుమాన్‌నగర్‌కు చెందిన ఆర్టీసీ కండక్టర్ ప్రభాకర్‌రెడ్డి భార్య సుక్రుత, కొడుకు నిఖిల్(24), కోడలు వాణితో కలిసి కారులో శనివారం సిద్దిపేట నుంచి హైదరాబాద్‌కు వెళుతున్నాడు. ఈ క్రమంలో ప్రజ్ఞాపూర్ శివారు రింగు రోడ్డు ఫ్లైఓవర్ దిగుతున్న క్రమంలో కారు అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లింది. ప్రమాదంలో డ్రైవింగ్ చేస్తున్న నిఖిల్ అక్కడికక్కడే మృతి చెందగా మిగతా వారికి గాయాలయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు దాటుతుండగా..


జయమ్మ మృతదేహం

మనోహరాబాద్(తూప్రాన్): రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. ఎస్‌ఐ సందీప్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..మేడ్చల్ మండలం దుండిగల్ గ్రామానికి చెందిన టి జయమ్మ(50) మనోహరాబాద్ మండలం రంగాయపల్లిలోని బంధువుల ఇంటికి వెళుతున్న క్రమంలో దండుపల్లి వద్ద రోడ్డు దాటుతుండగా ఆయిల్ ట్యాంకర్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆమె అక్కడిక్కడే మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బైక్ అదుపు తప్పి గాయాలు


గాయపడిన రాములు

కొల్చారం(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. స్థానికుల వివరాల ప్రకారం..ఆందోల్ మండలం చౌటకూరు గ్రామానికి చెందిన ఆకుల రాములు బైకుపై మెదక్ నుంచి వస్తున్న క్రమంలో కొల్చారం మండల పరిధిలోని పోతంశెట్టిపల్లి చౌరస్తా సమీపంలోకి రాగానే బైకు అదుపు తప్పి కమాన్‌ను ఢీ కొట్టాడు. ఈ ఘటనలో అతడి తలకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం 108లో మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.